క్లుప్తంగా

రేపు ములుకుదురులో బజరంగ్ నేత్రజ్యోతి శిబిరం

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



నగరంపాలెం: పొన్నూరు మండలంలోని ములుకుదురు, మాచవరం గ్రామాల పరిధిలోని వారికి ములుకుదురు మెయిన్ రోడ్డులోని వాటర్ ప్లాంటు వద్ద ఆదివారం బజరంగ్ నేత్రజ్యోతిని నిర్వహిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. నేత్ర సమస్యల నుంచి గ్రామస్తులందరికీ రక్షణ కల్పించడమే ఏకైక లక్ష్యమని ఆయన తెలియజేశారు. రైతులు, కూలీలు, వెనుకబడిన వర్గాలు, దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలు అధికంగా ఉన్న గ్రామాలకు ప్రాధాన్యతనిచ్చి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, రాజకీయాలకు అతీతంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కంటి సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి ఏడు రోజుల్లో కళ్లజోళ్లు అందిస్తున్నట్లు చెప్పారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా ఇప్పటి వరకు 12,990 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, 11,093 మందికి కళ్లజోళ్లను అందించినట్లు వివరించారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

నెహ్రూనగర్: చుట్టుగుంటలోని కార్యాలయంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ శుక్రవారం తెలియజేశారు. బీసీల అభివృద్ధే ధ్యేయంగా పలు తీర్మానాల్ని చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు అయ్యప్ప పడి పూజ

పాత గుంటూరు: అరండల్‌పేట ఏడో లైనులోని రామచంద్ర బ్రదర్స్ మెగా ఫర్నీచర్ షోరూం ఆవరణలో శనివారం అయ్యప్ప స్వామి పడి పూజ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధినేత పుష్పాల సుబ్బారావు ప్రకటనలో తెలిపారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో శ్రీనివాసన్ నాయర్ నిర్వహణలో అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. డప్పు శ్రీను బృందంతో భజన ఉంటుందని, అయ్యప్పలు, భవానీలు, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు సంగీత కళాకారుల సంఘం వార్షికోత్సవం

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియం వేదికగా గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం 12వ వార్షికోత్సవంతో పాటు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలను శనివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు మద్దు వెంకటస్వామి ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో కన్నా మాస్టారు, సంగీత గురువులు ఎం.ఎస్.బాబులను పురస్కారాలతో సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సినీ సంగీత విభావరి జరుగుతుందని, కళాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నెహ్రూనగర్: నల్లపాడు రోడ్డులోని శ్రీ సాయినాథ్ ఓల్డ్ ఏజ్ హోమ్ సొసైటీలో వృద్ధులకు శనివారం ఎస్‌కే. సుభాని దుప్పట్లు పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో ఫౌండేషన్ ఏర్పాటు చేసి మరింత సేవ కార్యక్రమాలు నిర్వహిస్తానని ఆయన చెప్పారు.

గురజాడకు ఘన నివాళి



లక్ష్మీపురం: రచనల ద్వారా వాడుక భాష వ్యాప్తికి, సమాజ సంస్కరణకు కృషి చేసిన గురజాడ అప్పారావు అభ్యుదయ కవితా పితామహుడని అవగాహన సంస్థ సభ్యులు కొనియాడారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం గురజాడ అప్పారావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీవేత్త ముప్పాళ్ల వి.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్య రంగంలో గురజాడ తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారని తెలిపారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ గురజాడ రచించిన దేశమును ప్రేమించుమన్నా.. పుత్తడి బొమ్మ పూర్ణమ్మ తదితర రచనలు ప్రజల్లో చైతన్యాన్ని పెంచాయని తెలిపారు.

లీకులతో తాగునీరు వృథా



నెహ్రూనగర్: తాగునీరు వృథాగా పోతున్నా ఇంజినీరింగ్ అధికారులు పైపులైనుకు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాయిబానగర్ 2వ లైను, పెదపలకూరు రోడ్డు, యూనియన్ బ్యాంకు ఎదురుగా పైపులైనుకు లీకులు ఏర్పడి పెద్ద ధారగా నీరు పోతోంది. పది రోజుల కిందట బ్యాంకు సిబ్బంది, ఇటు స్థానికులు మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు.

యువతా మేలుకో.. ఓటుహక్కు పిలుస్తోంది !

- నేడు, రేపు పోలింగ్ బూత్‌ల్లో అందుబాటులో బీఎల్‌వోలు
- జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండనున్న వారికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం



హెల్ప్ డెస్క్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి(ఫైల్)

నెహ్రూనగర్: ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి. అయితే, పలువురు యువకులు నమోదు కావడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల సంఘం మరోసారి ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా గత నెల 4, 5 తేదీల్లో క్యాంపెయిన్ డేస్ నిర్వహించింది. తిరిగి శని, ఆదివారాల్లో నిర్వహించనుంది. జనవరి 5వ తేదీ నాటికి తుది జాబితా విడుదల కానుంది.

మొత్తం 532 పోలింగ్ కేంద్రాలు

గుంటూరు తూర్పులో (250), పశ్చిమ నియోజకవర్గాల్లో(282) మొత్తం 532 పోలింగ్ కేంద్రాలున్నాయి. తూర్పులో 250 మంది, పశ్చిమలో 282 మంది బీఎల్‌వో(బూత్ లెవల్ ఆఫీసర్)లు విధులు నిర్వహిస్తున్నారు. వీరిపై సూపర్‌వైజర్ అధికారులుగా తూర్పులో 19, పశ్చిమలో 23 మందిని నియమించారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న బీఎల్‌వోలు ఓటర్ల జాబితా క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఎన్నికల కమిషన్ అక్టోబర్ 27న ఓటర్ల జాబితా విడుదల చేసింది. ఈ మేరకు తూర్పులో 2,43,198 మంది, పశ్చిమలో 2,69,218 మంది ఓటర్లు లెక్క తేలారు.

వందల సంఖ్యలో దరఖాస్తులు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ పరిధిలో గత నెల 4,5 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహించారు. తూర్పులో మొత్తం 326, పశ్చిమలో 487 ఫారం 6,7,8 దరఖాస్తులు అందాయి. నేడు, రేపు నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లో ఆయా పోలింగ్ బూత్‌ల్లో బీఎల్‌వోలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.

ఓటర్ల జాబితా వివరాలు	
తూర్పు	
మొత్తం ఓటర్లు	2,43,198
పురుషులు	1,18,327
మహిళలు	1,24,833
ఇతరులు	92
పశ్చిమ	
మొత్తం ఓటర్లు	2,69,218
పురుషులు	1,31,526
మహిళలు	1,37,638
ఇతరులు	54

ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన నిబంధనల ప్రకారం కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఓటర్స్.ఈసీఐ.జీఓవీ.ఇన్ వైబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవాల్సిన వారు ఫారం–6తో పాటు ఒక పాస్ ఫోటో జత చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

ప్రత్యేక హెల్ప్ డెస్క్

ఓటర్ల సందేహాల నివృత్తి కోసం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఓటర్లు ఏ సందేహం ఉన్నా 0863–2345104,2345105 నంబర్లలో సంప్రదించవచ్చు. ఓటర్లు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల్లోపు ఫోన్ చేసి సందేహాల్ని నివృత్తి చేసుకోవచ్చు.

ఇదే చివరి అవకాశం

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 532 పోలింగ్ బూత్‌ల్లో శని, ఆదివారాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహించి ప్రజల నుంచి కొత్త ఓటుకు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తాం. ఇదే చివరి అవకాశం కాబట్టి యువత సద్వినియోగం చేసుకోవాలి.

–కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్

ఫిబ్రవరి 2,3 తేదీల్లో ఏఎన్‌యూలో జాతీయ సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య కె. సునీత మాట్లాడుతూ 'బయోడైవర్సిటీ ఆక్వా కల్చర్ అండ్ ఆక్వాటిక్ టాక్సికాలజీ' అనే అంశంపై వచ్చే ఏడాది ఫిబ్రవరి 2, 3 తేదీల్లో యూజీసీ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా పరిశోధన సంస్థలు, యూనివర్సిటీల నుంచి ప్రతినిధులు పాల్గొననున్నారని చెప్పారు. సదస్సుకు పత్రాలు పంపే వారు జనవరి 10వ తేదీలోగా డైరెక్టర్‌కు పంపాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్ధయ్య, జువాలజీ అధ్యాపకురాలు ఆచార్య పద్మావతి పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించాలని మునిసిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్ ట్రేడ్ యూనియన్ నాయకులు మేయర్‌ను సంపత్‌నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి కోరారు. స్పందించిన మేయర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి, రంజాన్ వేడుకల్ని నిర్వహిస్తున్నామని, అదే తరహాలో ఈ సంవత్సరం కూడా క్రిస్మస్ వేడుకల్ని నిర్వహిస్తామని తెలిపారు. తేదీని ఖరారు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బూసి రాజాలత, యూనియన్ నాయకులు మధుబాబు, శ్యాంసన్, నరేష్, విలియమ్స్, కుమారి, ఎస్తేర్, పూజిత నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న నూరి ఫాతిమా

పట్నంబజారు: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని 11, 12, 13, 50 డివిజన్ల పరిధిలో శుక్రవారం ఏపీకీ జగన్ ఎందుకు కావాలి? కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్రంలో నలుమూలలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందని తెలిపారు. డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ ఇంగ్లిష్ విద్యను పేద విద్యార్థులకు అందిస్తూ సొంత మేనమామలా సీఎం వై.ఎస్.జగన్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆబిద్, సంకూరి శ్రీను, 12వ వార్డు ఇన్‌చార్జి సలీం, వైఎస్సార్ సీపీ నేతలు సుధాకర్ రెడ్డి, అగ్గిపెట్టి రాజు, హన్ను, నాగేశ్వరరావు, ముస్తఫా, మెహబూబ్, చిలుకా రమేష్, రవిరాజు, రాజేష్, కిరణ్ పాల్గొన్నారు.

పదో డివిజన్‌లో శంకుస్థాపన

తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని పదో డివిజన్ గాంధీ బొమ్మ సెంటర్‌లో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన కల్వర్టు పనులకు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మీరావలి, పార్టీ నేతలు సుబ్రహ్మణ్యం, సత్యం, సాంబశివరావు, కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం 57వ డివిజన్ గడ్డిపాడు, గణేష్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి, స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పఠాన్ రిహానా, నూర్‌ఖాన్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో భాష్యం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో భాష్యం రామకృష్ణ, శిరీష

గుంటూరు ఎడ్యుకేషన్: చదువుతో పాటు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా మేధస్సు అభివృద్ధి చెందుతుందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. గత నెల 30న వీవా ఆధ్వర్యంలో భాష్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్విజ్ పోటీల్లో గుంటూరు అర్బన్–1, నరసరావుపేట జోన్ శాఖలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన సందర్భంగా శుక్రవారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో విద్యార్థుల్ని రామకృష్ణ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో జెడ్‌ఈవో తలశిల సాంబశివరావు, ప్రిన్సిపాల్ పి. కృష్ణకిశోర్, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ శిరీష పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ శాఖ విధులపై సెక్రటరీలకు అవగాహన



సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జాయింట్ కంట్రోలర్ మాధురి

నెహ్రూనగర్: లీగల్ మెట్రాలజీ(తూనికలు, కొలతలు శాఖ) నిర్వహించే విధులపై గ్రామ, వార్డు సెక్రటరీలకు ఆ శాఖ జాయింట్ కంట్రోలర్ ఎం.ఎ.ఎస్.ఎస్. మాధురి అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో శుక్రవారం సచివాలయ సెక్రటరీలతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు లీగల్ మెట్రాలజీ శాఖకు చెందిన కొన్ని విధుల్ని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి కేటాయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని వ్యాపార సంస్థల వివరాలు, ప్యాకేజ్డ్ వస్తువుల్ని విక్రయించే వ్యాపార సంస్థల వివరాల్ని ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆమె సూచించారు. వ్యాపారస్తులు తప్పనిసరిగా ధ్రువీకరించిన తూనికలు, కొలతలు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వస్తువుల్ని ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించడంపై ఫిర్యాదుల్ని స్వీకరించి, వాటిని లీగల్ మెట్రాలజీ అధికారికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో సుజాత, గ్రామ, వార్డు సచివాలయం జిల్లా కో–ఆర్డినేటర్ మోహన్‌రెడ్డి, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి పాల్గొన్నారు.

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి

చేబ్రోలు: పశువుల్ని కడగడానికి క్వారీ గుంతలోకి దిగిన యువకుడు ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన సంఘటన చేబ్రోలు మండలం సుద్దపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తోట మహేష్ (25) పశువుల మేతకు గురువారం మధ్యాహ్నం వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. స్థానికులు, బంధువులు గాలించగా సుద్దపల్లి గ్రామ శివారులోని క్వారీ గుంత ఒడ్డున సెల్ ఫోను, కర్ర, చెప్పులు కనిపించాయి. గుంతలో గాలించగా మహేష్ శవం లభించింది.

వైభవంగా అక్కినేని ప్రతిభా పురస్కారాలు ప్రదానం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి పురస్కరించుకుని సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సారథ్యంలో శుక్రవారం యువకళావాహిని నిర్వహణలో అక్కినేని ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం సభ నిర్వహించారు. యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, న్యాయమూర్తి నేలపూడి చిరంజీవి, ఏపీపీఎస్‌ఎస్‌ఏటీ డెప్యూటీ చైర్మన్ బి. రామారావు, న్యాయవాది వరప్రసాద్, దర్శకులు కావూరి సత్యనారాయణ, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాల్ని ప్రారంభించారు. చిరస్మరణీయుడైన డాక్టర్ అక్కినేనిని స్మరించుకుంటూ కళాకారులకు ప్రతిభా పురస్కారాల్ని అందిస్తున్న సంస్థను అభినందించారు. ఈ సందర్భంగా సినీ నటుడు అశోక్ కుమార్, దర్శకుడు సీహెచ్. రజిత మూర్తి, ప్రముఖ వీణా విద్వాంసురాలు ఏ. భారతీ దేవి, టీవీ నటులు విడుదల సాంబశివరావు, పి. సూరిబాబు, పద్య కవి ఐనాల మల్లేశ్వరరావు, కళాకారుడు ఎస్.వి. రామారావును పురస్కారాలతో సత్కరించారు. అనంతరం అతిథుల్ని సంస్థ నిర్వాహకులు సత్కరించారు. అక్కినేని పాటలను వీణపై రామరాజు లక్ష్మీ శ్రీనివాస్ శ్రావ్యంగా వినిపించారు. అనంతరం అక్కినేని క్షైత్రయాత్ర డాక్యుమెంటరీ ప్రదర్శన ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. కార్యక్రమాల్ని లయన్ ఎం.ఏ. హమీద్, డి. తిరుమలేశ్వరరావు, సయ్యద్ జానీ బాషా, కె. రాధాకృష్ణ పర్యవేక్షించారు.



పురస్కార గ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

వరసిద్ధి వినాయక ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న శివస్వామి

పాత గుంటూరు: మాతృశ్రీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న శ్రీ వరసిద్ధి వినాయక సహిత శ్రీ గౌరీ కేదారేశ్వర దేవాలయ శంకుస్థాపన మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్లాయపాలెం శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు శ్రీ శివస్వామి పాల్గొని భూమిపూజ చేశారు. తొలుత ప్రధాన అర్చకులు కొండూరి మల్లికార్జునశాస్త్రి నేతృత్వంలో నడింపల్లి జానకీ శైలజ విజయప్రసాద్, చాపవరపు అనంతలక్ష్మీ గోపాలరెడ్డి దంపతులతో వేదపండితులు శాస్త్ర యుక్తంగా పూజలు, హోమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పశ్చిమ శాసనసభ్యులు మద్దాలి గిరిధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ శివస్వామి అనుగ్రహ భాషణం చేస్తూ కార్తిక మాసం పార్వతీ పరమేశ్వరులకు అత్యంత ప్రీతి పాత్రమని తెలిపారు. వరసిద్ధి వినాయక సహిత శ్రీ గౌరీ కేదారేశ్వరస్వామి వార్ల దేవస్థానం త్వరితగతిన పూర్తి చేసుకొని విశేష పుణ్యక్షేత్రంగా వర్ధిల్లుతుందని ఆశీస్సులు అందజేశారు. ట్రస్టీ నడింపల్లి విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ దాతల సహకారంతో దేవాలయంతో పాటు గోశాల, వృద్ధాశ్రమం, వేద పాఠశాల నిర్మించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కోట సత్యనారాయణ, గూడూరు వెంకటేశ్వరరావు, గుండు సుబ్రహ్మణ్యం, కటకంశెట్టి కోటేశ్వరరావు, వణుకూరి సాంబిరెడ్డి, నగర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



బాజీ మృతదేహం

పట్నంబజారు: అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. లాలాపేట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డులో నివాసం ఉండే షేక్ బాజీ (39) మిర్చి యార్డులో తొడాలు తీసే పనికి వెళుతూ ఉంటుంది. ఆరు నెలలుగా సంపత్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ సైదా (అల్లల్ల)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. శుక్రవారం ఎప్పటిలాగే పనికి వెళుతున్నానని చెప్పి వెళ్లిన షేక్ బాజీ సాయంత్రం ఇంటికి రాకపోవడంతో భర్త హుస్సేన్ పనిచేసే దుకాణానికి ఫోన్ చేశాడు. అప్పటికే వెళ్లిపోయిందని చెప్పారు. భర్త హుస్సేన్ సంపత్‌నగర్‌లోని సైదా నివాసానికి వెళ్లాడు. తలుపులు తీసి చూసేసరికి బాజీ మృతి చెంది పడి ఉంది. సంఘటనా స్థలంలో చేతి గాజులు పగిలి ఉండటం, సైదాకు ఫోన్ చేసినప్పటికీ స్పందించక పోవడంతో హత్య చేసి ఉంటాడనే అనుమానం పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. మృతురాలి భర్త హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిడ్స్ నియంత్రణ సామాజిక బాధ్యత



ర్యాలీకి జెండా ఊపుతున్న జూపూడి రంగరాజు, మధుసూదనరావు



హిందూ కళాశాల విద్యార్థుల మానవహారం



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జీజీహెచ్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు

నగరంలో పలుచోట్ల కళాశాలలు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎయిడ్స్ నియంత్రణ సామాజిక బాధ్యతగా గుర్తించాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ఫార్మసీ ప్రాక్టీసు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విభాగాలు సంయుక్తంగా శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగరాజు మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలన దిశగా సమాజాన్ని చైతన్యపర్చడంలో విద్యార్థులు ముఖ్యపాత్ర పోషించాలని తెలిపారు. లాడ్జి సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగిన ర్యాలీలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సంక్రమించేందుకు గల కారణాలు, లక్షణాలు, చికిత్సా విధానం, నివారణోపాయాలపై సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా తయారు చేసిన కరపత్రాల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె. రవికుమార్, ఫార్మాడీ డైరెక్టర్ పి. సీతారామయ్య, విభాగాధిపతులు ఎస్. హేమకుమారి, జె. శివజ్యోతి, రాజేష్, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్. అజిత్‌బాబు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు

గుంటూరు మెడికల్: హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణరాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి సూచించారు. వరల్డ్ ఎయిడ్స్‌డే సందర్భంగా శుక్రవారం స్థానిక సెయింట్ జోసఫ్ ఉమెన్స్ కళాశాలలో ఎయిడ్స్ రాకుండా మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సురక్షితం కాని రక్తం ఎక్కించడం, సిరంజులు వాడడం, విచ్చలవిడి శృంగారాల ద్వారా హెచ్‌ఐవీ సోకుతోందని వెల్లడించారు. ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, క్రమం తప్పకుండా మందులు వాడడం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను పెరగకుండా చూడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈట స్వరూపరాణి, గ్రేస్ ఇంద్ర, ప్రియదర్శిని, అత్తరునిస, ఎం. సుచరిత, ప్రశాంతి, స్టూడెంట్స్ పాల్గొన్నారు.


సమాజాన్ని చైతన్యపర్చాలి

గుంటూరు ఎడ్యుకేషన్: హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణలో సమాజాన్ని చైతన్యపర్చడంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని హిందూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా రెడ్ రిబ్బన్ క్లబ్, జువాలజీ, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందూ కళాశాల కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కె. చిరంజీవి, కళాశాల ఎన్‌సీసీ అధికారి జె. వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ సీహెచ్. రామకృష్ణ మూర్తి, సలహాదారుడు కె. కాళిదాస్, ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పి. వేణుగోపాల్, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త పీవీ రాము, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జువాలజీ విభాగాధిపతి శోభారాణి, అధ్యాపకులు టి. ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాజ్ సెంటర్, ప్రభుత్వ మహిళా కళాశాల, ఏసీ కళాశాల మీదుగా ఆసుపత్రి వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సామాజిక సహపంక్తి అల్పాహారం విందు నిర్వహించారు. రాత్రి నర్సింగ్ విద్యార్థిని, విద్యార్థులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి బాధితులు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

ఐసీఏఐ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీపై సదస్సు



గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీనివాసరావుతోటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖ, సౌత్ ఇండియా రీజనల్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో జీఎస్టీపై రెండు రోజుల పాటు నిర్వహించిన అవగాహన సదస్సు శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఏ పి.రాజేంద్రకుమార్ జీఎస్టీకి సంబంధించిన ముఖ్యమైన అంశాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల పరిధిలో అమల్లోకి వచ్చిన నిబంధనలపై సీఏలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐఆర్‌సీ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు, ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ మద్ది రవితేజ, కార్యదర్శి చింతా రఘునందన్, సభ్యులతో పాటు పెద్దసంఖ్యలో సీఏలు పాల్గొన్నారు.